సాక్షి తిరుపతి

మంగళవారం, 13, జూన్, 2023



ఉప్పొంగిన అభిమానం

పాకాల మండలం, నేంద్రగుంట నుంచి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి గడపగడపకు మహా పాదయాత్ర ప్రారంభించారు. - 8లో



సీట్లు లేవ్.. స్టాండింగ్

ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్ల తీరు తీసికట్టుగా మారుతోంది. స్టాపింగ్ పాయింట్ల వద్ద బస్సులు ఆపకపోవడం విమర్శలకు తావిస్తోంది. - 8లో



	గరిష్టం	కనిష్టం
తిరుపతి	40	28
చిత్తూరు	39	27
తిరుమల	35	24
గూడూరు	42	31
నగరి	41	28

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 92,238 మంది స్వామివారిని దర్శించుకోగా.. 40,400 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.02 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

14న మహాశాంతి హోమం

తిరుమల: మానవాళి శ్రేయస్సు కోసం టీటీడీ ఈనెల 14వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి ఘాట్ రోడ్డు (డౌన్ ఘాట్)లోని శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలోని 7వ మైలు వద్ద 'మహా శాంతిహోమం' నిర్వహించనుంది. రెండు ఘాట్ రోడ్లలో ప్రమాదాలు జరగకుండా, లోక శ్రేయస్సు కోసం టీటీడీ ఈ విశిష్ట హోమం నిర్వహించనుంది.

స్పందన అర్జీలకు పరిష్కారం చూపండి



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: స్పందన అర్జీలకు పరిష్కారం చూపాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో జేసీ డీకే బాలాజీ, డీఆర్వో కోదండరామిరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు భాస్కర్‌నాయుడు, శ్రీనివాసులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 132 అర్జీలు అందగా అందులో రెవెన్యూశాఖకు సంబంధించినవే 80 వరకు ఉన్నట్టు కలెక్టర్ తెలిపారు.

ఆ పాదయాత్రతో ఒరిగిందేమీ లేదు



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి: నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రతో ప్రజలకు ఒరిగేదేమి లేదని తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. తన నివాసంలో సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. లోకేష్ పాదయాత్రతో నెల్లూరు జిల్లాలో పెనుమార్పులు రానున్నాయని టీడీపీ చేస్తున్న ఆర్భాటపు ప్రకటనలు చూసి జనం నవ్వుకుంటున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ సస్పెండ్ చేసిన ఎమ్మెల్యేలు పార్టీలో చేరడమే పెనుమార్పులా..? అని ప్రశ్నించారు. ఇక టీడీపీ నేత ఆనం వెంకటరమణారెడ్డిపై జరిగిన దాడి ఖండించాల్సిందేనని, అయితే ఆ ఘటనలో ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి బ్లాక్‌డే ఆఫ్ ద నెల్లూరు సిటీ అంటూ వ్యాఖ్యానించడం ఆశ్చర్యం కల్గిస్తోందన్నారు. ఆల్లూరుపాడు ప్రాజెక్ట్ పనులను ఆయన కమీషన్‌ల కోసం అడ్డుకున్నారని, జగనన్న లేఅవుట్‌లో సైతం అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు.

బిందుసేద్య పరికరాల వాడకంపై శిక్షణ



శిక్షణ ఇస్తున్న అధికారులు

తిరుపతి అర్బన్ : బిందు సేద్య పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి జి.సతీష్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో బిందుసేద్య పరికరాల అమరిక, వాడకంపై ప్రత్యేకశిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 90శాతం సబ్సిడీతో పరికరాలను పంపిణీచేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆచార్య ఎన్‌జీ.రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ డ్రిప్ ఇరిగేషన్ సిస్టమ్‌లో ప్రధానంగా ఫిల్టర్లు, వాటి అమరిక ప్రెషర్‌గేజ్ ప్రాముఖ్యత, తీసుకోవాల్సిన జాగ్రత్తలు లేటరల్‌పైపుల అమరికకు సంబంధించిన విషయాలను విశదీకరించారు. పరికరాలను పొందడమే కాకుండా వాటి వాడకంపై అవగాహన ఉండాలన్నారు.

చెంగాళమ్మ విజయోత్సాహం!

భక్తుల కొంగుబంగారంగా.. కోర్కెలు తీర్చే కల్పవల్లిగా వర్ధిల్లుతున్న శ్రీచెంగాలమ్మ పరమేశ్వరి అమ్మవారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం రాత్రి కాళంగి నదీతీరాన నిర్వహించిన తెప్పోత్సవం విశేషంగా ఆకట్టుకుంది. వేలాది మంది భక్తుల నడుమ అమ్మవారు కాళంగి నదిలో ప్రత్యేకంగా అలంకరించిన తెప్పపై విహరిస్తూ కనువిందు చేశారు. బాణసంచా వెలుగులు.. భక్తుల జేజేలతో ఆ ప్రాంతం మార్మోగింది. మహిషాసురమర్దనం చేసి విజయోత్సాహంతో అమ్మవారు తెప్పపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

- అంగరంగ వైభవంగా చెంగాళమ్మ తల్లి తెప్పోత్సవాలు
- కాళంగి నదిలో విహరించిన అమ్మవారు
- భారీగా తరలివచ్చిన భక్తులు
- ప్రత్యేక ఆకర్షణగా బాణసంచా వెలుగులు
- అమ్మవారిని దర్శించుకున్న మంత్రి పెద్దిరెడ్డి దంపతులు





కాళంగి నదిలో తెప్పపై విహరిస్తున్న చెంగాళమ్మ తల్లి(ఇన్‌సెట్) బాణసంచా వెలుగుల్లో అమ్మవారు

సూళ్లూరుపేట: బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి చెంగాళమ్మతల్లి తెప్పోత్సవాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. తెప్పోత్సవానికి సూళ్లూరుపేట పరిసరప్రాంతాల నుంచే కాకుండా చిత్తూరు జిల్లా, తమిళనాడు నుంచి లక్షలాది మంది భక్తులు విచ్చేసి తరించారు. కాళంగినదిలో అమ్మవారు లాహిరి..లాహిరి..లాహిరిలో..అంటూ తెప్పపై విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. తెప్పోత్సవానికి తడ మండలం, వాటంబేడు కుప్పానికి చెందిన మత్స్యకారులు రెండు నాటు పడవలను జోడించి ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. ఈ పడవకు ప్రత్యేకంగా విద్యుదీపాలంకరణ చేసి అమ్మవారిని ఆశీనులు చేసి తెప్పోత్సవం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు గజ ఈతగాళ్లను సిద్ధం చేశారు.

ప్రత్యేక ఆకర్షణగా బాణసంచా

తెప్పోత్సవంలో బాణసంచా వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సుమారు రెండు గంటలు సేపు ఆకాశంలో విద్యుత్ దీపాలు వెలిగినట్టు ఆ ప్రాంతమంతా వెలుగులతో నిండిపోయింది.

భారీ బందోబస్తు

నాయుడుపేట డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 450 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానిక సీఐ వెంకటేశ్వర్లురెడ్డి, వాకాడు సీఐ హరికృష్ణ, నరసింహులు ఆధ్వర్యంలో దగ్గరుండి అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

చెంగాళమ్మ బ్రహ్మోత్సవాల్లో మంగళవారం రాత్రి అమ్మవారికి శయనోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేపట్టినట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

భక్తులకు అండగా..



గాయపడిన యువకుడ్ని ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి సుళ్ల ఉత్సవం అనంతరం గాలివానకు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. అదే సమయంలో ఓ భక్తుడు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగే మైదానంలో ఫెన్సింగ్‌పై సదరు భక్తుడు కాలు పెట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన పోలీసులు బాధితుడికి అండగా నిలిచారు. హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రాణాలు నిలిపారు.

అమ్మవారి సేవలో మంత్రి పెద్దిరెడ్డి దంపతులు



మంత్రి పెద్దిరెడ్డి దంపతులకు స్వాగతం పలికి ఆలయంలోకి ఆహ్వానిస్తున్న అర్చకులు, ఎమ్మెల్యే కిలివేటి

చెంగాళమ్మ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర విద్యుత్, అటవీ, పర్యావరణ, శాస్త్రసాంకేతిక, భూగర్భ గనులశాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, స్వర్ణలత దంపతులు సోమవారం అమ్మవారిని దర్శించుకున్నారు. మంత్రి ఆలయం వద్దకు విచ్చేయగా.. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, పార్టీ నాయకులు గజమాలతో ఘనంగా సత్కరించి సాదరంగా ఆహ్వానించారు. ఆలయ అర్చకులు వేదమంత్రాలు, మంగళవాయిద్యాలతో ఆహ్వానం పలికారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డి దంపతులు అమ్మవారికి సారెను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదనంతరం వేదపండితులు ఆశీర్వచనాలు అందించగా ఎమ్మెల్యే, ఆలయ అధికారులు ఘనంగా లడ్డూప్రసాదాలతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, వైస్ చైర్మన్ చిన్ని సత్యనారాయణ, పార్టీ నారాయకులు కళత్తూరు రామ్మోహన్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, తుపాకుల ప్రసాద్, కే రఘు, స్వామిరెడ్డి, జెట్టివేణుయాదవ్, రామకృష్ణారెడ్డి, శేషారెడ్డి, గోగుల తిరుపాల్, వాకాటి బాబురెడ్డి, నాయుడుపేట నాయకులు తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి, కామిరెడ్డి రాజారెడ్డి, కట్టా రమణారెడ్డి, కిషోర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బడి 'బుడి' అడుగులు!

నాడు

గత టీడీపీ పాలనలో పాఠశాలలు పునఃప్రారంభమై నెలలు గడిచినా ఉచిత పాఠ్యపుస్తకాలు అందేవి కావు. దొంగలు పడ్డ ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్టు.. సిలబస్ మధ్యలో ఇచ్చేవారు. పైగా పాఠశాలల్లో మౌలిక వసతులు ఉండేవి కావు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులు నమ్మకం కోల్పోవాల్సి వచ్చేది. ఫీజుల భారం ఉన్నప్పటికీ ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించే దుస్థితి దాపురించేది.

నేడు

బడులు పునఃప్రారంభం రోజునే విద్యార్థులందరికీ జగనన్న విద్యాకానుక పేరిట పాఠ్యపుస్తకాలతో సహా ఎనిమిది రకాల విద్యాసామగ్రిని అందజేస్తోంది. నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేసింది. కార్పొరేట్‌కు మించి అన్ని మౌలిక వసతులు కల్పించింది. దీంతో ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో నమ్మకం పెరిగింది. పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించి ఫీజుల భారం నుంచి ఉపశమనం పొందేలే చర్యలు చేపట్టింది.

- జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలు పునఃప్రారంభం
- తొలిరోజే జగనన్న విద్యాదీవెన కిట్ల పంపిణీ
- ఆనందం వ్యక్తం చేసిన తల్లిదండ్రులు

తిరుపతి ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా 34 మండలాల్లో సోమవారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు తెరుచుకోవడంతో విద్యార్థులు బడిబాట పట్టారు. పాఠశాలలను రంగు కాగితాలు, రంగవల్లికలు, మామిడి తోరణాలతో అలంకరించారు. ముందస్తుగానే పాఠశాలలకు ఉపాధ్యాయులు చేరుకుని విద్యార్థులకు స్వాగతం పలికారు. వరుసగా నాల్గవ ఏటా విద్యార్థులకు జేవీకే కిట్లను అందజేశారు. రాష్ట్ర స్థాయిలో ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రారంభించగా జిల్లా వ్యాప్తంగా 2,338 పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులు 1,66,664 మందికి జగనన్న విద్యాకానుక కిట్లను అందజేశారు.

మేనమామ కానుక

తొలిరోజే హాజరైన విద్యార్థులందరికీ జగనన్న విద్యాకానుక కిట్లు అందజేశారు. 1 నుంచి 10 వ తరగతి వరకు చదివే విద్యార్థులకు మూడు జతల యూనిఫాం క్లాత్ (కుట్టుకూలితో సహా), జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు, స్కూలు బ్యాగు, బైలింగువల్ పాఠ్యపుస్తకాలు (ఒక పేజీలో



తిరుపతిలోని ఎంజీఎం హైస్కూల్‌కు వెళ్తున్న విద్యార్థులు

ఇంగ్లిష్, మరో పేజీలో తెలుగు పాఠ్యాంశాలు), నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్‌తో పాటు అదనంగా ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లిష్-తెలుగు డిక్షనరీలను జగనన్న విద్యాకానుక కిట్‌లో అందజేశారు.

మొదలైన సందడి

సుదీర్ఘ విరామం అనంతరం పాఠశాలలు తెరుచుకున్న నేపథ్యంలో ఆయా పాఠశాలల్లో సందడి నెలకొంది. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పాఠశాల కమిటీ సభ్యులతో సందడి వాతావరణం కనిపించింది. ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం 7.30 నుంచి 11.30 గంటల వరకు పాఠశాలలు నిర్వహించారు.



పిల్లలను బడిలో చేర్చుకుంటున్న ఉపాధ్యాయురాలు



జేవీకే కిట్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ శాలిని మహేష్‌రెడ్డి


అవకాశాలను అందిపుచ్చుకోవాలి



విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్

రేణిగుంట: దేశంలో మరెక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిచ్చి పథకాలను అమలు చేస్తోందని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన రేణిగుంట బాలికోన్నత పాఠశాలలో జరిగిన జగనన్న విద్యాకానుక పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యాకానుక పంపిణీ కార్యక్రమం ఈనెల 19వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలే మారిపోయాయన్నారు. బైజూస్ ట్యాబులు 8వ తరగతి విద్యార్థులకు పంపిణీ చేశారని, ఈ సారి 8వ తరగతి విద్యార్థులకు అందించే ట్యాబులలో 8, 9, 10 తరగతుల పాఠ్యాంశాలు ఉంటాయన్నారు. అనంతరం విద్యార్థులకు విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. డీఈవో శేఖర్, తహసీల్దార్ శివప్రసాద్, ఎంఈవో ఇందిరాదేవి, రేణిగుంట సర్పంచ్ నగేషం, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, హెచ్‌ఎం విష్ణువర్ధనం పాల్గొన్నారు.

ఇద్దరు వార్డు సెక్రటరీల సస్పెన్షన్



కమిషనర్ హరిత

తిరుపతి తుడా: 'జగనన్నకు చెబుదాం'కు వచ్చిన ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించి తప్పుడు సమాచారం చేరవేసిన ఇద్దరు అమెనిటీ (ఇంజినీర్ అసిస్టెంట్లు) సెక్రటరీలను సస్పెండ్‌చేస్తూ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. తిరుపతి నగరంలోని 14, 3 డివిజన్ల పరిధిలోని ప్రజలు స్థానిక సమస్యలను 'జగనన్నకు చెబుదాం'కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులను అధికారులు సచివాలయ సెక్రటరీలకు చేరవేశారు. అయితే క్షేత్ర స్థాయిలో వాటిని పరిష్కరించకుండా సంబంధిత ఇంజినీర్లకు సమాచారం లేకుండానే ఆన్‌లైన్‌లో తప్పుడు సమాచారాన్ని అప్‌లోడ్ చేశారు. సంబంధిత అధికారులు సమస్యలపై ఆరాతీయగా అసలు విషయం బయటపడింది. దీనిపై విచారణచేసిన కమిషనర్ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన 14/2 అమినిటీ సెక్రటరీ సుజనశ్రీ, 3/1 సెక్రటరీ గురుప్రసాద్‌పై శాఖాపరమైన చర్యలు చేపట్టి విధుల నుంచి తొలగించారు. అనంతరం కమిషనర్ సచివాలయ సెక్రటరీలకు జూమ్ మీటింగ్ నిర్వహించారు.

హరివిల్లు అందాలు

నైరుతీ రుతుపవనాల రాకతో నీలాకాశం విభిన్న వాతావరణ పరిస్థితుల మేళవింపునకు నెలవుగా మారింది. సోమవారం ఉదయం నుంచి భానుడి తాపానికి తల్లడిల్లిన జనం సాయంత్రం కాస్త ఉపశమనం కలిగించేలా చిరుజల్లులు పడడం.. ఆపై కైలాసగిరులపై ఎండా..వాన కలయిక నడుమ హరివిల్లు విరబూయడం కనువిందు చేసింది. ఈ సుందర దృశ్యాన్ని పలువురు తమ సెల్ ఫోన్లలో బంధించడం కనిపించింది.

కేతారి మోహన్‌కృష్ణ, సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



ఆరోగ్య సంకల్పం!



చినిగేపల్లెలో ఈసీజీ తీసుకుంటున్న విధానాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

భాకరాపేట : నియోజకవర్గంలోని ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని భావించి ఉచిత వైద్య పరీక్షలు కార్యక్రమాన్ని చేపట్టినట్లు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి బాస్కర్‌రెడ్డి స్పష్టం చేశారు. చిన్నగొట్టిగల్లు మండలం, జంగావాండ్లపల్లె పంచాయతీ, జంగావాండ్లపల్లె, చినిగేపల్లె, బోడిరెడ్డిగారిపల్లె గ్రామాల్లో జరుగుతున్న వైద్య శిబిరాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలతో మాట్లాడారు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటే మన ప్రాంతం బాగుంటుందన్నారు. ఇంటిల్లిపాది ఆరోగ్యంగా ఉండాలన్న సంకల్పంతో ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరికీ రూ.3 వేల విలువ చేసే ఆరోగ్య పరీక్షలు చేయిస్తున్నట్టు చెప్పారు. నియోజకవర్గంలోని 1.5 లక్షల కుటుంబాలకు వైద్య పరీక్షలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, సర్పంచ్ సింహాల విమల, ఎంపీడీవో దేవేంద్రబాబు, ఈవోపీఆర్‌డీ మదనమోహనరాజు, ఏపీఎం కుమార్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇరానీ గ్యాంగ్ దొంగ అరెస్ట్

తిరుపతి క్రైం: దోపిడీలు, దొంగతనాలు చేసే ఇరానీ గ్యాంగ్ దొంగను అరెస్ట్ చేసినట్లు క్రైమ్ ఏఎస్పీ విమలకుమారి తెలిపారు. సోమవారం క్రైమ్ పోలీస్ స్టేషన్లో పట్టుబడిన దొంగను చూపించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ నిందితుల వివరాలు వెల్లడిస్తూ.. అన్నమయ్య జిల్లా, వాల్మీకిపురానికి చెందిన షేక్ హైదర్ అలీ(35) 2021 నుంచి చింతలపూడి, గూడూరు, చిత్తూరు, గుంటూరు, రాజంపేట, ఎర్రగ్రొండపాలెం, కల్లూరు, మదనపల్లి చుట్టుపక్కల ప్రాంతాల్లో రాబరీ, బ్యాగ్ లిఫ్టింగ్, బంగారు షాపుల్లో కెళ్లి ఏమార్చి దొంగతనాలకు పాల్పడేవాడు. ఇతనిపై గూడూరు, పాత గూడూరు, కడప, చిత్తూరు, తిరుపతి స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. తిరుపతిలో ఆర్టీసీ బస్టాండ్, చిన్న బజారు వీధి, బెస్తవీధి ప్రాంతాల్లో బ్యాగ్ లిఫ్టింగ్‌లకు పాల్పడేవాడు. దొంగతనం చేసిన సొత్తుతో పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా వీరిని అలిపిరి చెర్లోపల్లి రోడ్ లోని సైన్స్ సెంటర్ వద్ద అదుపులోకి తీసుకున్నట్టు ఏఎస్పీ తెలిపారు. అతని నుంచి రూ.5 లక్షల విలువ చేసే 91 గ్రాముల బంగారు స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. కేసును ఛేదించడంలో క్రైమ్ డీఎస్పీ రవికుమార్, సిబ్బంది కృషిని అభినందించారు.

ఉప్పొంగిన అభిమానం

- పాకాల నుంచి ప్రారంభమైన మహాపాదయాత్ర
- చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి అపూర్వ స్వాగతం
- హోరెత్తిన బైక్‌ర్యాలీ

పాకాల: మండలంలోని నేంద్రగుంట నుంచి చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి గడపగడపకు మహా పాదయాత్రను ప్రారంభించారు. సోమవారం ఉదయం అక్కడకు చేరుకున్న ఆయనకు సుమారు నాలుగు వేల బైక్‌లతో నాయకులు భారీ స్వాగతం పలికారు. ర్యాలీగా పాకాలకు చేరుకోగా.. అక్కడ భారీ గజమాలను క్రేన్ సహాయంతో వేసి అభిమానం చాటుకున్నారు. యువ నాయకుడు మోహిత్‌రెడ్డి నాయకత్వం వర్థిల్లాలి అంటూ కేరింతలు కొట్టారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం బందార్లపల్లి వరకు బైక్ ర్యాలీగా వెళ్లి అక్కడ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి, వినాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అడుగడుగునా బాణసంచా సంబరాలు హోరెత్తించారు. బందార్లపల్లి గ్రామస్తులు అపూర్వ స్వాగతం పలికారు.


ర్యాలీలో బైక్ నడుపుతున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

ఎనలేని అభిమానం

బందార్లపల్లి గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మహా పాదయాత్రలో ప్రజలు ఎనలేని అభిమానాన్ని చాటారు. తమ గడప ముంగిటకు వచ్చిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడిని చూసి సంతోషంతో ఉప్పొంగిపోయారు. తమ కుటుంబ సభ్యుడిలా ఆదరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందుతున్నాయని ఆనందంగా చెప్పుకొచ్చారు. తన సంపాదనలో 75 శాతం ప్రజలకే ఖర్చు చేసే నాయకుడు మన ఎమ్మెల్యే అని ప్రజలు కొనియాడారు.

ప్రజాభీష్టం మేరకే పాలన

రాష్ట్రంలో ప్రజాభీష్టం మేరకే పాలన కొనసాగుతోందని, ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజాసంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వం సంకల్పించిందని వివరించారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజల వెంటే ఉండి అండగా నిలబడిన మహా నాయకుడు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అని తెలిపారు. 'మీ వెంటే మేము' అంటూ ప్రజలు ప్రతినబూనారు. కార్యక్రమంలో ఎంపీపీ లోకనాథం, వైస్ ఎంపీపీలు చెన్నకేశవరెడ్డి, నాగూర్బిరహీం, కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, నంగా కపిలేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ గౌతమివినాయక, సర్పంచ్ సునీత, ఉప సర్పంచ్ ఇమ్రాన్, ఎంపీడీఓ రమేష్, తహసీల్దార్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


గజమాలతో స్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,760
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,546
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.75,500
రిటైల్ వెండి గ్రాము	రూ.77.50

గేదెను ఢీకొని ఒకరి మృతి

చిల్లకూరు: గూడూరు వైపు వస్తున్న వ్యక్తి రోడ్డుపై అడ్డుగా వచ్చిన గేదెను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన సోమవారం వేకువజామున కమ్మవారిపాళెం సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. కోట మండలం, ఊనుగుంటపాళెంకు చెందిన పండూరు గోపాలయ్య (65) పని మీద బైక్‌లో గ్రామం నుంచి గూడూరు వైపు వస్తున్నాడు. కమ్మవారిపాళెం పంచాయతీలోని చీమల తిప్ప వద్దకు వచ్చే సరికే రోడ్డుపై గేదె అడ్డు రావడంతో దానిని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గేదెతోపాటు గోపాలయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించి పోస్టు మార్టం నిమిత్తం మృత దేహాన్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పలమనేరు: మండలంలోని కాలువపల్లి వద్ద పలమనేరు–గుడియాత్తం రోడ్డుపై సోమవారం ఆటో బోల్తాపడిన ప్రమాదంలో కాలువపల్లికి చెందిన సుబ్రమణ్యం(26) అనే వ్యక్తి మృతి చెందాడు. స్వగ్రామానికి ఆటోలో వెళుతుండగా ఆటో బోల్తాపడిన సందర్భంలో సుబ్రమణ్యం కిందపడగా అతనిపై ఆటో పడడంతో తలకు గాయమైంది. ఆయనను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు.

జీపీఎస్‌తో ఆర్టీసీకి ప్రయోజనం


చల్లా చంద్రయ్యతోపాటు పలువురు ఉద్యోగ సంఘ నేతలు

తిరుపతి అర్బన్: జీపీఎస్‌తో ఆర్టీసీ ఉద్యోగులకు ఎంతో ప్రయోజనమని ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయీ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య తెలిపారు. సోమవారం తిరుపతి సెంట్రల్ బస్టాండ్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. రిటైర్డ్ ఉద్యోగులకు గతంలో రూ.4 వేలు పెన్షన్ వచ్చేదని, 50 శాతం పెన్షన్ స్కీమ్ ఏర్పాటు చేయడంతో నాలుగురెట్లు పెన్షన్ అదనంగా రానుందని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 52వేల మంది ఆర్టీసీ ఉద్యోగులకు ప్రయోజనం చేకూరుతుందని ఆయన స్పష్టం చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అప్పుల ఊబిలో ఉన్న ఆర్టీసీని గట్టుకు లాక్కొచ్చారని గుర్తుచేశారు. ఆయన తనయుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు అడుగులు ముందుకు వేసి ఏకంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులకు అండగా నిలిచారని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు అర్జున్, కార్యదర్శి తులసీరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పరంధామయ్య పాల్గొన్నారు.

డ్రైవర్ల చేతిలోనే విద్యార్థుల ప్రాణాలు



హాజరైన కళాశాలల వాహనాల డ్రైవర్లు, మాట్లాడుతున్న డీటీవో సీతారామిరెడ్డి

తిరుపతి మంగళం : విద్యార్థుల ప్రాణాలు ఆయా పాఠశాలల వాహనాల డ్రైవర్ల చేతిలోనే ఉంటాయన్న విషయాన్ని డ్రైవర్లు గుర్తుపెట్టుకోవాలని జిల్లా రవాణాశాఖాధికారి (డీటీవో) సీతారామిరెడ్డి తెలిపారు. కళాశాలలు, స్కూల్స్ ప్రారంభమైన నేపథ్యంలో సోమవారం తిరుపతి–కరకంబాడి రోడ్డులోని ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో డ్రైవర్లకు వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సి జాగ్రతలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలు తమ చేతుల్లో ఉన్నాయన్న భయంతో డ్రైవర్లు వాహనాలను నడపాలని సూచించారు. డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడడం, మద్యం సేవించడం వంటివి చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ఎఫ్‌సీ చేయకుండా విద్యార్థులను తరలిస్తున్న మూడు పాఠశాలల వాహనాలను రవాణాశాఖ అధికారులు సీజ్ చేశారు. స్కూల్స్ ప్రారంభమైన నేపథ్యలో ప్రతి కళాశాల, స్కూల్ బస్సులకు ఎఫ్‌సీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, కుసుమ పాల్గొన్నారు.

రెండు కిలోల గంజాయి స్వాధీనం


అరెస్ట్ అయిన వ్యక్తులను, గంజాయిని చూపిస్తున్న సీఐ నాగరాజురెడ్డి

తిరుపతి క్రైం: యువతను మత్తుకు బానిస చేస్తున్న ఇద్దరు వ్యక్తులను సోమవారం రాత్రి అరెస్ట్ చేసినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నాగరాజురెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు మేరకు.. తాతయ్య గుంటలో నివాసం ఉంటున్న ఉమాపతి, హరికృష్ణ, సవిరెడ్డి మదనగోపాల్ అక్రమంగా గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం వచ్చింది. సిబ్బందితో దాడి నిర్వహించగా వారి నుంచి రెండు కిలోల గంజాయి చిక్కింది. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తొమ్మిది ఎర్రచందనం దుంగలు స్వాధీనం


ఎర్రచందనం దుంగలు, కూలీలతో సీఐ కోటేశ్వరావు, ఎస్ఐ రంగనాథ్‌గౌడ్, సిబ్బంది


మాట్లాడుతున్న సీఐ కోటేశ్వరావు, రంగనాథ్‌గౌడ్

రాపూరు: వెలుగొండ అడవుల నుంచి అక్రమంగా కారులో తరలిస్తున్న తొమ్మిది ఎర్రచందనం దుంగలను ఆదివారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్టు రాపూరు సీఐ కోటేశ్వరరావు తెలిపారు. వీటిని తరలిస్తున్న నలుగురు స్మగ్లర్లను కూడా అదుపులోకి తీసుకున్నట్టు ఆయన వెల్లడించారు. సీఐ కథనం మేరకు.. వెలుగొండ అడవుల నుంచి ఎర్రచందనం తరలిస్తున్నట్లు ఎస్ఐ రంగనాథ్‌గౌడ్‌కు సమాచారం అందింది. దీంతో సిబ్బందితో కలిసి టోల్‌ప్లాజా వద్ద ఏపూరు నుంచి రాపూరు వైపు వస్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా అందులో 9 ఎర్రచందనం దుంగలు, నలుగురు వ్యక్తులు, 5 సెల్‌ఫోన్లు, వారికి ఎస్కార్ట్‌గా వచ్చే కారును గుర్తించి, స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు. పట్టుబడిన వారిలో శ్రీకాళహస్తికి చెందిన షబీర్, మున్నతోపాటు తమిళనాడుకు చెందిన మాణిక్యంగోవిందరాజ్, ముత్తుతీర్థన్ ఉన్నట్టు పేర్కొన్నారు. వీరిని విచారించగా బెంగళూరుకు చెందిన వ్యక్తి రాపూరు మండలం, తెగచర్ల గ్రామ సమీపంలోని అడవుల్లోకి తమిళ కూలీలను పంపి ఎర్రచందనం దుంగలను నరికిస్తున్నట్టు తేలింది. ఎర్రచందనం దుంగలు తరలించేందుకు ఐదుగురు తమిళ కూలీలు రాగా అందులో ముగ్గురు వేరే వాహనంలో తప్పించుకెళ్లినట్టు గుర్తించారు. 9 ఎర్రచందనం దుంగల బరువు 231 కిలోలు ఉన్నట్టు సీఐ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్న పోలీసులను డీఎస్పీ కోటారెడ్డి అభినందించారు.

వరకట్న వేధింపుల కేసులో ఇద్దరి అరెస్ట్

- విదేశాలకు వెళుతుండగా అదుపులోకి తీసుకున్న ఇమ్మిగ్రేషన్ అధికారులు

సాక్షి, అమరావతి: వరకట్న వేధింపుల కేసులో నిందితులుగా ఉన్న ఇద్దరు వ్యక్తులు విదేశాలకు వెళుతుండగా చెన్నై విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని మీనంబాకం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ సమాచారాన్ని మీనంబాకం పోలీసులు కేసు నమోదు చేసిన విశాఖపట్నం పోలీసులకు అందించారు. దీంతో విశాఖ పోలీసులు చెన్నై వచ్చి స్థానిక కోర్టు అనుమతితో వారిని ట్రాన్సిట్ వారెంట్ మీద విశాఖపట్నంకు తరలించారు. లుక్‌ఔట్ సర్క్యులర్ జారీ అయిన నేపథ్యంలో తిరుపతికి చెందిన అనంత రమేష్ నాయుడు, ఆయన కుమారుడు అనంత యోగ శ్రీనివాస్ ఈనెల 11న దుబాయ్ వెళుతుండగా వారిని ఇమ్మిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. గుంటూరుకు చెందిన మేఘన వివాహం తిరుపతికి చెందిన అనంత రమేష్ రవితేజతో 2020లో జరిగింది. రవితేజ విదేశాల్లో ఉద్యోగం చేస్తుండడంతో మేఘన తల్లిదండ్రులు వివాహం సందర్భంగా పెద్ద మొత్తంలో కట్న కానుకలు సమర్పించారు. వివాహం అయిన నాటి నుంచే భర్త రవితేజ, కుటుంబ సభ్యులు వరకట్నం కోసం వేధిస్తున్నారంటూ మేఘన పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విశాఖపట్నం దిశా పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదే సమయంలో మేఘన సీఐడీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐడీ అదనపు డీజీ ఆదేశాల మేరకు రవితేజ, ఆయన తల్లిదండ్రులు, తమ్ముడు, మరదలిపై లుక్‌ఔట్ సర్క్యులర్ జారీ అయింది. ఇదిలా ఉండగా రమేష్ నాయుడు, అతని కుమారుడు యోగి శ్రీనివాస్ ఆదివారం దుబాయ్ వెళ్లేందుకు చెన్నై విమానాశ్రయానికి వచ్చారు. వీరిపై లుక్‌ఔట్ నోటీసులు ఉండడంతో ఇమ్మిగ్రేషన్ అధికారులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఆ సమాచారం అందుకున్న విశాఖ దిశ పోలీసులు వారిని ట్రాన్సిట్ వారెంట్ మీద విశాఖపట్నంకు తరలించారు.

మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ


అధ్యక్షుడు పి.నరసింహులు


ప్రధాన కార్యదర్శి పుట్టా మహేంద్ర

తిరుపతి కల్చరల్: మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా నూతన కమిటీని ఎంపిక చేసినట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ తెలిపారు. సోమవారం గంధమనేని శివయ్య భవన్‌లో మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రథమ మహాసభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్కర్స్ సమస్యలపై చర్చించారు. అనంతరం యూనియన్ జిల్లా నూతన కమిటీని ఎంపిక చేశారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడుగా కె.రాధాకృష్ణ, అధ్యక్షుడుగా పి.నరసింహులు, ఉపాధ్యక్షులుగా అంకమ్మ, మురళి, గోపి, చంద్ర, వరలక్ష్మి, మంజుల, ప్రధాన కార్యదర్శిగా పుట్టా మహేంద్ర, సహాయ కార్యదర్శులుగా పి.కిషోర్, ఎం.మునివేలు, పి.మీనా, సునీల్, కోశాధికారిగా ఎస్.పురుషోత్తంతో పాటు 13 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సీట్లు లేవ్..స్టాండింగ్

'సర్.. బస్సు ఖాళీగా లేదు.. సీట్లన్నీ ఫుల్లయ్యాయి.. ముందు బస్సు దిగేయండి.. వెనుక ఖాళీగా వస్తోంది. ఆ బస్సులు రండి' ఇదీ ఆర్టీసీ సిబ్బంది నుంచి వినిపిస్తున్న మాట. సీట్లు ఖాళీగా ఉన్నా.. ఆపేందుకు డ్రైవర్లు ఆసక్తి చూపకపోగా.. కొందరు కండక్టర్లు టిక్కె ట్లు కొట్టి డబ్బులు తీసుకోవాలన్నా ఇబ్బంది పడిపోతున్నారు. బస్సు ఖాళీ లేదు.. దిగండి అంటూ.. ప్రయాణికులను ఒకింత దగమాయిస్తూ దింపేస్తున్నారు.. వెనుక వస్తున్న బస్సునైనా ఎక్కదామంటూ ఆ సిబ్బందే అదేమాట.. ఇదెక్కడో కాదండోయ్.. మన తిరుపతి జిల్లాలోనే.. దీంతో చేసేది లేక ప్రయాణికులు నరక యాతన అనుభవిస్తున్నారు.

- ఆగకుండా వెళ్లిపోతున్న ఆర్టీసీ సర్వీసులు
- డ్రైవర్లు, కండక్టర్ల తీరుపై ప్రయాణికుల మండిపాటు

తిరుపతి అర్బన్: ఆర్టీసీ ఆర్థిక కష్టాలు అందరికీ తెలిసిందే. ప్రతి డిపో కష్టాల్లోనే నడుస్తోంది. దీనికితోడు 2020–21లో కోవిడ్ మరింత దెబ్బ తీసింది. ఆ తర్వాత తిరుపతి జిల్లా లాభాల దిశగా పయనిస్తోంది. అయినప్పటికీ ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ ఉద్యోగులు వ్యవహరించాల్సి ఉంది. అయితే కొందరు డ్రైవర్లు, కండక్టర్లు బస్టాండ్‌లో, స్టాపింగ్ పాయింట్ల వద్ద బస్సు ఆపకుండా వెళ్లిపోతుండడం విమర్శలకు తావిస్తోంది.

ఇదిగో సాక్ష్యం


రెండు రోజుల క్రితం ఓ ప్రయాణికుడు సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో శ్రీకాళహస్తి సమీపంలోని మిట్టకండ్రిగ బస్టాపింగ్ పాయింట్ వద్దకు చేరాడు. దాదాపు 20 నిమిషాల తర్వాత ఓ ఆర్డినరీ సర్వీసు వచ్చింది. బస్సు ఖాళీగా ఉన్నా డ్రైవర్ ఆపలేదు. చెయ్యెత్తి మొత్తుకున్నా కన్నెత్తి చూడలేదు.. దీంతో చేసేది లేక తమిళనాడుకు ఆర్టీసీ బస్సులో ఆ యువకుడు తిరుపతికి వెళ్లాల్సి వచ్చింది.

వెనుక బస్సు ఖాళీగా వస్తోంది

శ్రీకాళహస్తి, పుత్తూరు, చిత్తూరు మార్గాల్లో తిరుపతికి వచ్చిపోయే బస్సుల్లో స్టాపింగ్ ఉన్నా, ప్రయాణికులు చెయ్యెత్తి మొత్తుకున్నా బస్సులు ఆగకుండా వెళ్లిపోతున్నాయి. సార్ సీట్లు లేవు.. వెనుక బస్సు ఖాళీగా వస్తోంది.. అంటూ ఉచిత సలహాలు ఇచ్చి వెళ్లిపోతున్నారు. ఆర్టీసీ కండక్టర్లు చెప్పిన మాటలు నిజమేనని తర్వాత వచ్చే వెనుక బస్సును ఆపినా అదే పరిస్థితి. మరీ పిల్లలు, వృద్ధులు ఉంటే అస్సలు ఆపడం లేదు. చిన్నపాటి బ్యాగ్‌లు ఉన్నా ఆపని పరిస్థితి. దీంతో ప్రజలు ఆర్టీసీ ఉద్యోగుల తీరును తప్పుపడుతున్నారు. తాము స్టాడింగ్ జర్నీ చేయడానికి సిద్ధంగా ఉన్నా బస్సులు ఆపకుండా వెళ్తున్నారని మండిపడుతున్నారు.


తిరుపతి బస్టాండ్

సీట్లతో పనిలేదు



సీట్లతో పనిలేదు. తప్పకుండా బస్సును ఆయా సర్కిళ్లలో నిలపాలి. ప్రయాణికులు చెయ్యెత్తిన చోటంతా బస్సును ఆపాల్సిందే. జిల్లాలోని డీఎంలకు స్పష్టమైన ఆదేశాలు ఇస్తాం. లేదంటే డ్రైవర్లు, కండక్టర్లపై చర్యలు తప్పవు.

–చెంగల్‌రెడ్డి, ఆర్‌ఎం, ఆర్టీసీ